సాక్షి పార్వతీపురం మన్యం

శుక్రవారం । 18 । జూలై । 2025



కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్దాం - 8లో

సీఎం చంద్రబాబు మోసపూరిత పాలనను ప్రజల్లోకి తీసుకెళ్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ సబ్‌కంట్రోల్ - 8లో

విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ సబ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ వకుల్ జిందల్ గురువారం ప్రారంభించారు.



వైద్యసౌకర్యం అందక మరణాలు

పీటీడీ(ఆర్టీసీ) ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ ద్వారా వైద్యసౌకర్యాలు అందక ఏడాదికి 350 మంది చనిపోతున్నారని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

పాలకొండ రూరల్/గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్‌సీపీ పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగ అధ్యక్షుడిగా దుప్పాడ పాపినాయుడు నియమితులయ్యారు. వైఎస్సార్‌టీయూసీ విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కురుపాం నియోజకవర్గానికి చెందిన వడ్డి మహేశ్వరరావును నియమించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియామకాలు చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.

శంబర పోలమాంబ ఆలయ ఈఓగా శ్రీనివాసరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈఓ శ్రీనివాసరావు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆలయ ఈఓగా బి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఈఓగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై శంబర పోలమాంబ అమ్మవారి ఆలయ గ్రేడ్–1 ఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు పోలమాంబ అమ్మవారి ఆలయ ఈఓగా పనిచేసిన వి.వి.సూర్యనారాయణ పాలకొండ కోటదుర్గ అమ్మవారి ఆలయం, తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం, పార్వతీపురంలోని గ్రూపు దేవాలయాల అధికారిగా బదిలీ అయ్యారు.

ఏజెన్సీలో సీఆర్‌పీఎఫ్ బలగాల కూంబింగ్



మక్కువ-దుగ్గేరు రోడ్డులో సీఆర్‌పీఎఫ్ బలగాల కూంబింగ్

మక్కువ: ఏజెన్సీ గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియాన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్ నేతృత్వంలో గురువారం సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. మార్కొండపుట్టి, బొడ్డు సామంతవలస, ఎర్ర సామంతవలస, పనసబద్ర, దుగ్గేరు, మూలవలస తదితర గ్రామాల్లో అనుమానిత ప్రదేశాలను నిశితంగా పరిశీలించాయి. కల్వర్టుల వద్ద మెటల్‌డిటెక్టర్‌తో తనిఖీలు జరిపాయి. మక్కువ మండలం ఆంధ్రా–ఒడిశా బోర్డర్‌లో ఉండడంతో మావోయిస్టు కదలికలపై ఆరా తీశాయి.

పోలవరం ఎత్తు తగ్గితే ఉత్తరాంధ్రలో కరువు ఖాయం

బొబ్బిలి రూరల్: పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గితే ఉత్తరాంధ్రలో కరువు ఖాయమని, కూటమి ప్రభుత్వం ప్రాజెక్టు ఎత్తుతగ్గించేలా చేపట్టే నిర్మాణాలవల్ల తీరని నష్టం కలుగుతుందని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. తన కార్యాలయంలో స్థానిక విలేకరులతో గురువారం మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో ముందు చూపుతో పోలవరం నుంచి సుజలస్రవంతి ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్ర ప్రజలకు సాగు, తాగునీరిందేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని, నేటి ప్రభుత్వం ఉత్తరాంధ్రకు అన్యాయం చేసేందుకు యత్నిస్తోందని ఆయన విమర్శించారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తు వరకు నీటిని నింపి ఉత్తరాంధ్ర ప్రజల అవసరాలను తీర్చేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మాణాత్మకంగా చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కేంద్రం ఒత్తిడికి తలొగ్గి 41.15 మీటర్లకు కుదించేలా ఒప్పందం చేసుకుందని, దీనివల్ల ఉత్తరాంధ్ర ప్రజల తాగు, సాగునీటి అవసరాలు పోలవరం ప్రాజెక్టుతో నెరవేరవన్నారు. కూటమి తీరును ఉత్తరాంధ్ర ప్రజలు క్షమించరన్న విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో సమితి సభ్యులు ఆర్.శంకరరావు, కృష్ణ పాల్గొన్నారు.

కాలక్షేపమా.. కాలయాపనా!

గిరిజనేతరులకు ఏం పని?

- జీవో నంబర్ 3పై అభిప్రాయ సేకరణ
- తూతూమంత్రంగా నిర్వహణ
- గిరిజనేతరులూ సమావేశంలోకి..
- జీవో కాదు.. చట్టం చేయాల్సిందే అని స్పష్టం చేసిన గిరిజన సంఘాలు

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం రూరల్: జీవో నంబర్–3ను పునరుద్ధరిస్తామని గత ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. గెలిచాక మాట దాటేశారు. ఏడాదికిపైగా కాలక్షేపం చేసి.. ఇప్పుడు తీరిగ్గా కాలయాపనకు సిద్ధమయ్యారు. జీవో అమల్లో ఇబ్బందులంటూ చెప్పుకొస్తూ.. ప్రత్యామ్నాయ జీవో అంటూ గిరిజనులను ఒప్పించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోంది. జీవో నంబర్– 3, గిరిజన చట్టాలపై అభిప్రాయాలు, సూచనలు, సలహాల కోసమని గురువారం పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో వర్క్ షాప్ నిర్వహించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్.భార్గవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజన సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ న్యాయ సలహాదారు డాక్టర్ పల్లా త్రినాథరావు జీవో నంబర్– 3ను సుప్రీంకోర్టులో ఎందుకు కొట్టి వేశారో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వాస్తవానికి ఇదంతా గడిచిన అధ్యాయం. అందులో ఇబ్బందులు, గత ప్రభుత్వం వేసిన రివ్యూ పిటిషన్‌ను న్యాయస్థానం డిస్మిస్ చేయడం.. ఇవన్నీ కూటమి ప్రభుత్వానికి ఎరుకే. తెలిసీ ఎన్నికల ముందు సంబంధిత జీవోను పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలోనూ ప్రకటించారు. గిరిజన ప్రాంతాల్లో చేసిన ప్రచారంలోనూ ప్రకటనలు చేశారు. ఇప్పుడు మాట మార్చి, అమలు చేయకుండా ఆలస్యం చేయడం.. అభిప్రాయ సేకరణ అంటూ దాటవేయడం కాలయాపన చేయడానికే అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వానికి నివేదిస్తాం...

జీవో నంబర్–3పై గిరిజనుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్.భార్గవి తెలిపారు. గిరిజన సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు,



ఐటీడీఏ వద్ద ఆదివాసీ సంఘం, ప్రజాసంఘాల నిరసన

న్యాయవాదుల అభిప్రాయాలను తీసుకున్న అనంతరం ఆమె మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన జీవో నంబర్–3ను సుప్రీంకోర్టులో రద్దు చేసిన నేపథ్యంలో వివిధ సంఘాలు, న్యాయవాదులు చేసిన ఉద్యమాల ద్వారా తిరిగి పునరుద్ధరణ చేయాలని దరఖాస్తులు వచ్చాయని, దీనికి స్పందించి గిరిజన ప్రాంతంలో ఉన్న ఐటీడీఏల పరిధిలో వర్క్‌షాప్ ఏర్పాటు చేసి అభిప్రాయాలను స్వీకరించే విధంగా సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందరితో



మాట్లాడుతున్న డైరెక్టర్ భార్గవి

చర్చించాక మరింత మెరుగ్గా జీఓను అమలు చేసే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడారు.

గిరిజనుల నుంచి అభిప్రాయ సేకరణ అని చెప్పి.. సమావేశానికి గిరిజనేతరులనూ ఆహ్వానించడంపై తొలుత విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇదే విషయమై గిరిజన సంఘాల నాయకులు అధికారులను నిలదీశారు. జీవోను నీరుగార్చే ఉద్దేశంతోనే అందరినీ పిలిచారంటూ పలువురు విమర్శించారు. దీంతో సమావేశ మందిరంలో కాసేపు గందరగోళం ఏర్పడింది. అనంతరం కొంతమంది అభిప్రాయాలను మాత్రమే సేకరించారు. సీతంపేట తదితర ప్రాంతాల నుంచి సంఘాల నాయకులు మాట్లాడేందుకు వచ్చినా వారికి అవకాశం ఇవ్వలేదు. చాలామందికి వినతి పత్రం అందిస్తే పరిశీలిస్తామని చెప్పి, సరిపెట్టేశారు.

- చట్ట పరిధిలో గిరిజనులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మాజీ శాసనసభ్యులు నిమ్మక జయరాజు తెలిపారు. సుప్రీం కోర్టు ద్వారా రద్దు చేసిన జీవోలోని అంశాలు అనుకూలంగా ఉండాలంటే రాజ్యాంగ సవరణ ఒక్కటే మార్గమన్నారు. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ మేరకు మాత్రమే ఇది సాధ్యపడుతుందన్నారు.
- చట్టాలు అమలు కాని పరిస్థితి ఉందని మాజీ శాసనసభ్యులు కోలక లక్ష్మణమూర్తి అన్నారు. గిరిజన ప్రాంతాల్లో వంద మంది ఉద్యోగాలు చేస్తే.. అందులో 96 మంది గిరిజనేతరులే ఉంటున్నారని తెలిపారు. ఇంకా సమానత్వం ఎక్కడుందని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల్లో చదువుకునే వారి సంఖ్య నానాటికీ తగ్గిపోతోందని తెలిపారు. సమ సమాజంలో గిరిజనులకు సమానత్వం కల్పించాలని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ ఆచరణ కావడం లేదన్నారు.
- ఐదవ షెడ్యూల్‌లో ఉన్న తమను ఆరో షెడ్యూల్‌కు పంపేలా కేంద్రానికి ప్రభుత్వం సిఫారసు చేయాలని, అప్పుడే గిరిజనులకు తగిన న్యాయం జరుగుతుందని కురుపాం మండలం లంకజోడి గ్రామ సర్పంచ్ ఆరిక విప్లవ కుమార్ కోరారు.
- గిరిజన ప్రాంతాల్లో జిల్లా యూనిట్‌గా తీసుకొని వంద శాతం గిరిజనులకు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని.. గిరిజన భాషను నేర్చుకున్న వారినే ఉపాధ్యాయులుగా నియామకం చేపట్టాలని గిరిజన ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు గేదెల రామకృష్ణారావు కోరారు.
- రద్దు చేసిన జీవో పక్కాగా అమలు కావాలంటే సవరణ ఒక్కటే మార్గమని గుమ్మలక్ష్మీపురం మండలం చింతలగూడ సర్పంచ్ నిమ్మక సింహాచలం తెలిపారు.
- జీవో 3 పునరుద్ధరణ జరగదని, ప్రత్యామ్నాయం కావాలని మొత్తంగా పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా జీవోలను మార్చేస్తున్నారని చెప్పారు. జీవోలు వద్దు.. చట్టం కావాలని స్పష్టం చేశారు. అప్పుడే మార్చడానికి వీలుండదన్నారు. గిరిజనుల పక్షాన ప్రభుత్వాలు, ఐటీడీఏ అధికారులు పోరాడాలని కోరారు.
- రాజ్యాంగ సవరణ చేసైనా షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగాలన్నీ గిరిజనులకు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవికి వినతి పత్రం అందజేశారు. ఇప్పటి వరకు జీవో నంబర్–3 సక్రమంగా అమలు కాలేదన్నారు. జీవోలు కాకుండా చట్టం తేవాలని కోరారు. అభిప్రాయ సేకరణ కాలక్షేపం, కాలయాపన చేస్తే పోరాటం తప్పదని స్పష్టం చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు ముందే గిరిజన సంఘాల అభిప్రాయం తీసుకుని ఉంటే బాగుండేదన్నారు.
- షెడ్యూల్డ్ ఏరియాలో జీవో 3 స్థానంలో వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక రిజర్వేషన్ చట్టం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజాసంఘాలు కోరాయి. మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ పోస్టులను మినహాయించాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఐటీడీఏ వద్ద ఆయా సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

మీడియా అవసరం లేదా.. సమాచార శాఖ అత్యుత్సాహం

జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వపరంగా నిర్వహించాల్సిన ఏ కార్యక్రమాలకూ మీడియాతో పని లేదన్నట్లే వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమాచార శాఖ నుంచి వారు పంపించింది రాసుకోవడమే తప్ప.. అన్ని కార్యక్రమాలనూ గోప్యంగానే నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఓ వర్గం మీడియా తప్ప, ఇంకేమీ అవసరం లేదన్నట్లు జిల్లా అధికారుల వైఖరి ఉంది. అందరికీ తెలిసి జరగాల్సిన జీవో నంబరు 3 అభిప్రాయ సేకరణ కార్యక్రమంలోనూ సమాచార శాఖ అదే వైఖరి అవలంబించింది. ముఖ్యంగా 'సాక్షి' మీడియా పట్ల దురుసుగా వ్యవహరించింది. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే సాక్షి మీడియాపై అక్కసు వెళ్లగక్కారా, లేకుంటే స్వతహాగా నిర్ణయం తీసుకున్నారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. సమావేశంలో వారికి నచ్చిన మీడియానే ఉంచి, మిగిలిన వారిని బయటకు పంపించేశారు. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం విషయంలోనూ మీడియా ప్రతినిధుల పట్ల అధికారులు ఇదే మాదిరి నిర్లక్ష్యం చూపారు. ఈ అంశాలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి.



సమావేశ మందిరం వద్ద ఆరుబయటే వేచిచూస్తున్న మీడియా ప్రతినిధులు

దళిత మహిళ నిర్బంధం అమానుషం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుష్పశ్రీవాణి

- రెడ్‌బుక్ రాజ్యాంగానికి స్వస్తి పలకాలి
- లేదంటే పదింతలు బ్లూ బుక్ రాజ్యాంగం అమలు చేయాల్సి ఉంటుంది
- మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి హెచ్చరిక

జియ్యమ్మవలస రూరల్: రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తే భయపడేది లేదు.. ఎంతమందిపై కేసులు పెడతారో మేమూ చూస్తాం.. స్థానిక ఎమ్మెల్యే అవినీతి బాగోతాన్ని, వర్కులపై తీసుకున్న కమీషన్లు, ఉద్యోగాల పేరిట వసూలు చేసిన దందాల వివరాలను బయటపెడతామని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి స్పష్టంచేశారు. చినమేరంగి క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తురకనాయుడువలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, సోషల్ మీడియా ఐటీ విభాగం అధ్యక్షురాలు ఎత్తిలు మణిని మంగళవారం జియ్యమ్మవలస పోలీసులు 13 గంటల పాటు నిర్బంధంలోకి తీసుకోవడం తగదన్నారు. సోషల్ మీడియాలో ఓ పోస్టును కాపీ చేసి తన ఫేస్‌బుక్‌లో పెట్టినందున కూటమి పార్టీ నాయకుల మనోభావాలు దెబ్బతీశాయంటూ ఆమెపై కేసు పెట్టడాన్ని తప్పుబట్టారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఒత్తిడితో కూటమి నాయకులు 20 మంది వరకు జియ్యమ్మవలస పోలీసు స్టేషన్‌కు వచ్చి పోలీసులపై ఒత్తిడి తీసుకురావడం, దళిత మహిళని చూడకుండా 13గంటల పాటు నిర్బంధంలోకి తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఇలాంటి సంప్రదాయం కురుపాం నియోజకవర్గంలో మునుపెన్నడూ చూడలేదన్నారు. తాను ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు ఇష్టానుసారంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని, వారి భావ స్వేచ్ఛకు ఏనాడూ అడ్డుపడలేదని, రాజకీయాల్లో ఉన్నప్పుడు ఇలాంటి ఆరోపణలు, అవమానాలు భరించాలన్నారు. నియోజకవర్గంలో గత ఐదేళ్లగా వైఎస్సార్‌సీపీ చేసిన అభివృద్ధి కనిపించడం లేదంటే ఇంతకంటే అబద్ధం, అసత్యం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి కార్యకర్తలకు ఇళ్లు, గోశాలలు, నీటి తొట్టెలకే పరిమితమైందన్నారు. గోశాలలు నిర్మించిన చాలా మందికి బిల్లులు రాక ఆవేదన చెందుతున్న విషయాన్ని టీడీపీ నేతలు గుర్తించాలన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుత, గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై ఎప్పుడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఈ సారి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సూచన మేరకు రెడ్‌బుక్ రాజ్యాంగానికి బదులిస్తామని, దానికోసం మా దగ్గర బ్లూబుక్ ఉందని, అందులో ఎవరెవరి పేర్లు రాయాలో ఇప్పటికే రాశామన్నారు. కొంతమంది పోలీసులు అత్యుత్సాహం చూపి పోలీస్ వ్యవస్థ గౌరవాన్ని పోగొట్టుకోవద్దని అభ్యర్థించారు. కార్యక్రమంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల పార్టీ కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

- కలెక్టర్‌ను కోరిన ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కోరారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. ఏనుగులతో కొమరాడ, గరుగుబిల్లి, కురుపాం, జియమ్మవలస, భామిని, సీతంపేట మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏనుగుల వల్ల ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో సుమారు రూ.1.50 కోట్ల ఎంపీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో బెలగాం రైల్వేగేట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి పరిసర గ్రామస్తుల ఇబ్బందులు తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.



కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు సమస్యలు వివరిస్తున్న అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి

బస్తా యూరియా కోసం.. 3 గంటలు క్యూలో..



ఈ చిత్రం చూశారా... వీరంతా యూరియా కోసం వీరఘట్టం మేజర్ పంచాయతీలోని రైతుసేవా కేంద్రం వద్ద గురువారం ఉదయం 8 నుంచి క్యూ కట్టిన రైతులు. ఒక యూరియా బస్తా కోసం 3 గంటల పాటు నిరీక్షించారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలకు వేసేందుకు యూరియా అవసరం కావడం, ప్రభుత్వం అవసరం మేర సరఫరా చేయకపోవడంతో.. మగ, ఆడ తేడా లేకుండా రైతులందరూ పనులు మానుకుని యూరియా కోసం పరుగులు తీశారు. ఎరువు కొరతకు ఈ చిత్రమే సజీవసాక్ష్యం.

- రైతన్నకు తప్పని ఎరువు కష్టాలు
- పనులు మానుకొని ఎరువుకోసం నిరీక్షణ
- కూటమి ప్రభుత్వం తీరుపై ఆగ్రహం

వీరఘట్టం:

జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ప్రాజెక్టుల నుంచి సాగునీరు విడుదల చేయడంతో అక్కడక్కడ వరి ఉభాలు సాగుతున్నాయి. మరోవైపు మెట్టభూముల్లో పత్తి, మొక్కజొన్న, వివిధ రకాల కూరగాయల పంటలు మొక్క దశలో ఉన్నాయి. వీటికి ఎరువు వేసే సమయం ఆసన్నమైంది. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియా సరఫరాలో విఫలమైంది. **జిల్లాలో యూరియా కొరత వెంటాడుతోంది.** రైతుసేవాకేంద్రాలకు వచ్చిన అరకొర యూరియా కోసం రైతులు పనులు మానుకుని పరుగులు తీయాల్సిన పరిస్థితి. వీరఘట్టం మేజర్ పంచాయతీలో గురువారం రైతుకు ఒక యూరియా బస్తా



యూరియా బస్తాలను ఇళ్లకు తీసుకెళ్తున్న రైతులు

అందజేశారు. వాటి కోసం 3 గంటల పాటు నిరీక్షించారు. కూటమి ప్రభుత్వం రైతన్నకు సాగుసాయం అందజేయడంలోనే కాదు ఎరువు కొరత తీర్చడంలోనూ విఫలమైందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. గత ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు సరఫరా చేస్తే... ప్రస్తుత ప్రభుత్వం విత్తనాలు, ఎరువులను అందజేయకుండా రైతన్నను ఇబ్బందులకు గురిచేస్తోందంటూ ఆవేదన వ్యక్తంచేశారు. గత ఐదేళ్లలో ఖరీఫ్‌లో ఏనాడూ ఎరువు, విత్తనాల కోసం ఎక్కడా క్యూకట్టలేదని, కూటమి ప్రభుత్వంలో మళ్లీ రైతన్నకు కష్టాలు మొదలయ్యాయంటూ నిట్టూర్చారు.

400 బస్తాల పంపిణీ..

వీరఘట్టం మేజరు పంచాయతీలోని ఆర్‌ఎస్‌కేకు 440 బస్తాల యూరియా వచ్చింది. వీటిని ఉదయం పంపిణీ చేస్తారన్న సమాచారంతో రైతులు పెద్ద ఎత్తున మార్కెట్‌యార్డులో ఉన్న ఆర్‌ఎస్‌కే వద్ద బారులు తీరారు. రైతులు ఎక్కువ మంది క్యూలో నిల్చోవడం, యూరియా తక్కువ కావడంతో ఒక రైతుకు ఒక బస్తా చొప్పున మండల వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. యూరియా పంపిణీ సజావుగా సాగేందుకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్ఐ కృష్ణమనాయుడు, కానిస్టేబుల్ వచ్చి బందోబస్తు విధులు నిర్వహించారు. రైతులకు అవసరమైన యూరియాను తెప్పిస్తామని, ఆందోళన చెందవద్దని ఏఓ తెలిపారు.

కష్టాలు ఆరంభం



గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యూరియా కోసం ఏనాడూ ఇబ్బందులు పడలేదు. ప్రస్తుతం యూరియా కోసం గంటల కొద్దీ క్యూలో ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 5 ఎకరాల్లో వరిసాగుకు సిద్ధమయ్యాను. నారుమడులకు వేసేందుకు కూడా యూరియా దొరకడంలేదు. రైతులకు ఎరువు కష్టాలు ఆరంభమయ్యాయి.

– కిల్లారి శ్రీను, రైతు, వీరఘట్టం

పనులన్నీ మానుకుని...



యూరియా కోసం సొసైటీ, రైతు సేవా కేంద్రానికి పది రోజులుగా పనులు మానుకుని తిరుగుతున్నాను. ఈ రోజు ఒక బస్తా యూరియా దొరికింది. ఇలా అయితే... ఎరువు కోసం తిరిగేందుకే సమయమంతా సరిపోయేలా ఉంది. పొలం పనులు ఎప్పుడు చేస్తాం. ఇది సరి కాదు.

– ఇంటి లక్ష్మణరావు, రైతు, వీరఘట్టం

ఎరువుకోసం ఇన్ని ఇబ్బందులా..



ఒక బస్తా యూరియా కోసం ఇన్ని ఇబ్బందులు పడాల్సి వస్తోంది. యూరియా వచ్చిందని తెలియడంతో ఉదయం 8 గంటలకు మార్కెట్ యార్డుకు వెళ్లి క్యూలో ఉంటే ఒక్క బస్తా ఇచ్చారు. రెండు ఎకరాల్లో కూరగాయల పంటలు సాగు చేస్తున్నాను. ఒక బస్తా యూరియా చాలదు. కావాల్సిన యూరియాను ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.

– కర్రి శంకరరావు, రైతు, వీరఘట్టం

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

పార్వతీపురం: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అభిప్రాయపడ్డారు. పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో భాగంగా గరుగుబిల్లి మండలంలోని సుంకి, సంతోషపురం గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం తనిఖీ చేశారు. సుంకి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎరువు తయారీని పరిశీలించారు.

అన్నిచోట్ల ఎరువు తయారీకి ప్రాధాన్యమివ్వాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై పల్లె ప్రజలకు అవగాహన కల్పించాలని, తడి, పొడిచెత్తనే వేర్వేరుగా సేకరించాలన్నారు. కాలువలు, వీధుల పరిశుభ్రతతోపాటు స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, ఎంపీడీఓ జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీఓ ఎల్.గోపాలరావు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికార ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

తమ సమస్యలను పరిష్కరించాలని తోటపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామమైన సుంకి గ్రామ నిర్వాసితులు సర్పంచ్ కె.రవీంద్రతో కలిసి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. నిర్వాసితులకు తక్షణమే పునరావాసం కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు.



సుంకిలో వర్మీకంపోస్టు ఎరువు తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

క్లుప్తంగా

వాలీబాల్ విజేత ఏపీఈపీడీసీఎల్ జట్టు



ప్రథమస్థానంలో నిలిచిన విజయనగరం ఏపీఈపీడీసీఎల్ జట్టు

విజయనగరం ఫోర్ట్: ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ వాలీబాల్ టోర్నమెంట్‌లో విజయనగరం ఏపీఈపీడీసీఎల్ జట్టు విజేతగా నిలిచింది. 2025–26 సంవత్సరానికి సంబంధించి కర్నూలు జిల్లా శ్రీశైలంలో ఈనెల 15 నుంచి17 వతేదీ వరకు ఇంటర్ సర్కిల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో విజయనగరం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా రాజమండి సర్కిల్ జట్టు ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో నెల్లూరు జట్టు నిలిచాయి.

తపాలా రాష్ట్రఆర్గనైజింగ్ కార్యదర్శిగా హేమలత



ఆర్గనైజింగ్ కార్యదర్శి హేమలత

బాడంగి: తపాలాశాఖ రాష్ట్ర ఉద్యోగుల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్.హేమలత (పాల్తేరు పోస్టుమాస్టర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నంద్యాలలో జరిగిన ఏఐజీడీఎస్‌యూ 14వ వార్షిక ఎన్నికల్లో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆమె గురువారం చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర యూనియన్ మహిళా కమిటీ మెంబర్‌గా కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆమె గతంలో తపాలా ఉద్యోగుల సంఘం బొబ్బిలి బ్రాంచికార్యదర్శిగా, రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షురాలిగా, కేంద్ర ప్రత్యేక ఆహ్వానితురాలిగా కూడా సేవలందించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్రయూనియన్ నాయకులు, జీడీఎస్ సభ్యులందరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం




మద్యం సీసాలు ధ్వంసం చేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిల్స్‌ను గురువారం ధ్వంసం చేశారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దొర సమక్షంలో ఐదు కేసుల్లో పట్టుబడిన రూ.5,500లు విలువైన మద్యాన్ని పోలీసులు పారబోశారు. ఈ సందర్భంగా దొర మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయించినా, బెల్టుషాపులు నిర్వహించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సారా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, ఎస్సై రవికిరణ్, రెవెన్యూ సిబ్బంది అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో 21 నెలల జైలు

డెంకాడ: మండలంలోని అక్కివరం గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో విశాఖకు చెందిన మల్లి సూరిబాబుకు 21 నెలల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా చెల్లించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాస రావు తీర్పు చెప్పినట్లు ఎస్సై ఎ.సన్యాసి నాయుడు గురువారం తెలిపారు. 2021వ సంవత్సరం నవంబర్ 27వ తేదీన అక్కివరం గ్రామంలోని నడిపల్లి రాజినాయుడు ఇంటిలోని బీరువాలో రూ.లక్షా 3వేల నగదు, ఏడు తులాల బంగారు ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. అప్పట్లో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై పద్మావతి కేసు దర్యాప్తు చేసి చార్జిషీట్ ఫైల్ చేశారు. మల్లి సూరిబాబు అనే వ్యక్తి ఈ దొంగతనానికి పాల్పడినట్లు కోర్టు నిర్ధారించి పై విధంగా శిక్ష విధించిందని ఎస్సై వివరించారు.

విద్యార్థులతో పీపుల్స్ స్టార్ సమావేశం



మాట్లాడుతున్న సినీనటుడు ఆర్.నారాయణ మూర్తి

పార్వతీపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో పీపుల్స్ స్టార్, సినీనటుడు ఆర్.నారాయణ మూర్తి గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్నేహ చిత్ర బ్యానర్ మీద యూనివర్సిటీ..పేపర్ లీక్ అనే చిత్రాన్ని తెరకెక్కించానని సేవా రంగంగా ఉండాల్సిన విద్యారంగం భారతదేశంలో వ్యాపార రంగంగా మారిందన్నారు. వ్యాపార రంగం కావడంతో చాలా ప్రైవేట్ సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయని, ఈ క్రమంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ మసకబారుతోందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం కావాలి గానీ, మసకబార కూడదని, అందుకని సేవా రంగంలో ఉన్న విద్యను, వైద్యాన్ని జాతీయం చేయాలనే విషయాన్నే ఈ చిత్రంలో బలంగా చెప్పానన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతి రావు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్దాం

- ఇంటింటికీ క్యూఆర్ కోడ్‌తో వివరిద్దాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు

పార్వతీపురంటౌన్: సీఎం చంద్రబాబు నాయుడు ఏడాది కాలంగా చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఫంక్షన్ హాల్ ఆవరణలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీపై పురపాలక, మండల స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులతో అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో' పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం శత్రుచర్ల పరీక్షిత్ రాజు మాట్లాడుతూ హామీలు విస్మరించిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఛీదరించుకుంటున్నా రన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిన తీరును ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ క్యాడర్ వెళ్లి వివరించాలని కోరారు. యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు అన్ని వర్గాలవారిని మోసం చేసిన ఘనత చంద్రబాబుదని వివరించారు. రెడ్ బుక్ రాజ్యాంగానికి ఎవరూ భయపడరని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు బొమ్మి రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్‌లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వర రావు, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీలు సిద్దా జగన్నాథం, బంకురు రవికుమార్, రాష్ట్ర ఆర్టీఐ విభాగం కార్యదర్శి దేవుపల్లి నాగరాజు, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి బి.వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పోల సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షులు గొర్లి మాధవరావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షురాలు సుధ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్‌లు, పార్టీ ప్రతినిధులు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, వార్డు ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల పనితీరు శూన్యం



ఎన్నికల ముందు కూటమి నేతలు సూపర్ సిక్స్ హామీలతో అధికారం చేపట్టారు. తీరా అధికారం చేపట్టిన తరువాత వారి పనితీరు శూన్యంగా ఉంది. అధికారం చేపట్టి 14 నెలలు గడుస్తున్నా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమానికి వెళ్తున్న కూటమి నాయకులను ప్రజలు ఛీదరించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మహిళలు, యువత, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు అన్నివర్గాలవారిని మోసం చేస్తూ వస్తోంది. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రతి కార్యకర్త, నాయకులు వివరించాల్సిన అవసరం ఉంది.

డాక్టర్ గుమ్మ తనూజారాణి, ఎంపీ అరకు

మోసపూరిత హామీలను వివరిద్దాం



చంద్రబాబు ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన వాటిని విస్మరించారు. ఆ మోసపూరిత హామీలను ఎండగడదాం. హామీలు అమలు చేసేంత వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తారు. రైతులకు సాయం ఇప్పటి వరకు లేదు. నిరుద్యోగ యువతీ, యువకులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి స్తామన్నారు. ఇప్పటివరకు ఎక్కడా ఇవ్వడం లేదు. బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని 5 వారాలు నిర్వహించి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తాం. **– మామిడి శ్రీకాంత్, తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్**

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం



సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ నినాదంతో ప్రజల్లోకి తీసుకువెళ్దాం. కూటమి ప్రభుత్వ పాలన, చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. ప్రజల గొంతుకగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ముందుకు సాగుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం. సీఎం చంద్రబాబు హామీలన్నీ అమలు చేశామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కేవలం కూటమి నేతలు సంపద సృష్టించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. గ్రామ, మండల స్థాయిలో చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించే కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త భాధ్యతగా తీసుకోవాలి.

–అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే పార్వతీపురం



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

భవానీకి కలెక్టర్ అభినందనలు

- తక్షణమే ఇల్లు మంజూరుకు ఆదేశాలు



వెయిట్ లిఫ్టర్ రెడ్డి భవానీని సత్కరిస్తున్న కలెక్టర్



భవానీని సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: ఇటీవల కజకిస్థాన్‌లో జరిగిన జూనియర్ ఆసియన్ చాంపియన్ షిప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వరుసగా 3 బంగారు పతకాలను సాధించి, జిల్లా కీర్తి పతాకాన్ని ఎగురవేసిన కొండకరకాం గ్రామానికి చెందిన క్రీడాకారిణి రెడ్డి భవానీని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభినందించారు. ఈ మేరకు గురువారం తన క్యాంపు కార్యాలయంలో దుశ్శాలువ, జ్ఞాపికతో భవానీని సత్కరించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ తరఫున రూ.25వేల నగదు ప్రోత్సాహకాన్ని చెక్కు రూపంలో అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలంటూ ప్రోత్సహించారు. రెడ్డి భవాని నేపథ్యాన్ని, ఆర్థిక పరిస్థితిని కలెక్టర్ తెలుసుకుని అప్పటికప్పుడు తహసీల్దార్ కూర్మనాథరావును రప్పించి వెంటనే ఆమెకు ఇంటి పట్టా ఇవ్వాలని ఆదేశించారు. అలాగే హౌసింగ్ పీడీ మురళీమోహన్‌ను పిలిచి ఇల్లు మంజూరు చేయడమే కాకుండా, నిర్మాణ బాధ్యతను కూడా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులతో పాటు, జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరరావు, కోచ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టర్ భవానీకి హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ సత్కారం

కొండకరకాం క్రీడాకారిణి రెడ్డి భవాని భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు గురువారం హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ అధ్యక్షుడు దవడ కొండబాబు, దవడ మీనా అధ్యక్షతన భవానీకి జరిగిన సత్కార సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు, ఎంపీ కలిశెట్టి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఆమె పరిస్థితిని తీసుకువెళ్లాలని భీశెట్టి కోరారు. సత్కార సభలో కొత్తా సునీల్, ముంతాజమ్మ, స్రవంతి, కొండబాబు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజు, నాగభూషణం, రమేష్, రాంమోహన్, శ్రీను, రామచంద్ర రాజు తదితరులు భవానీకి ఆర్థిక సహాయం చేశారు.

విపత్తుల నివారణకు స్కౌట్స్ అండ్‌గైడ్స్ సేవలు అందించాలి



శిక్షణలో పాల్గొన్న పీఎం స్కూల్స్ స్కౌట్స్ అండ్‌గైడ్స్

- డీఈఓ రాజశేఖర్

సీతానగరం: స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందిన విద్యార్థులు విపత్తుల సమయంలో ప్రజల రక్షణకు ఆత్మ విశ్వాసంతో సేవలందించాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓ రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో పీఎం స్కూల్స్‌లో విద్యార్థులకు కోర్సు డైరెక్టర్ నారాయణమూర్తి స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డీఈఓ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో అగ్నిప్రమాదాలు, వంటగ్యాస్ ప్రమాదాలు, పరిశ్రమల్లో ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు వంటి విపత్కర పరిస్థితుల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓలు చిన్నం నాయుడు, విజయ్‌కుమార్, రజియా బేగం, నరసింహస్వామి, పాల్గొన్నారు.


ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ సబ్‌కంట్రోల్




ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ సబ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ వకల్ జిందల్, చిత్రంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు

విజయనగరం క్రైమ్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ సబ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ వకుల్ జిందల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందన్నారు. స్కూల్స్, కాలేజీలు, ఆస్పత్రులు, సినిమా హాల్స్ ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లోనే ఉండడం వల్ల ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ రద్దీ తరచూ ఏర్పడుతుందన్నారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ రెగ్యులేషన్ చేపట్టడం కష్టంగా ఉంటుందని, దీనిని అధిగమించడానికే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ సబ్ కంట్రోల్ ఏర్పాటు చేయాలని సంకల్పించామని ఇందులో భాగంగా ట్రాఫిక్ సబ్ కంట్రోల్ ను ఏర్పాటు చేసి, ప్రారంభించామన్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ విధులు నిర్వర్తించే సిబ్బంది తీవ్రమైన వేసవి, వర్షా కాలంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించడానికి ఇబ్బంది లేకుండా ఈ సబ్ కంట్రోల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదే విధంగా చిన్న చిన్న దొంగతనాలు, ఈవ్ టీజింగ్ వంటివి నియంత్రించ వచ్చునన్నారు. ఈ సబ్‌కంట్రోల్ రూమ్‌లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ఏర్పాటు చేశామని, లౌడ్ స్పీకర్లను ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గేటు, ఔటు గేటు, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సబ్ కంట్రోల్‌లో ఒక ఎస్సై, ఒక ఏఎస్సై, ఇద్దరు హెచ్‌సీలు, ముగ్గురు కానిస్టేబుల్స్ ఉంటారని, వారు ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా విధులు నిర్వహిస్తారని ఎస్పీ తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాస రావు, ట్రాఫిక్ సీఐ సూరి నాయుడు, టూ టౌన్ సీఐ టి.శ్రీనివాసరావు, రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, ట్రాఫిక్ ఎస్సైలు భాస్కరరావు, రవి, నూకరాజు , పీసీలు భాస్కర్, రమణలు పాల్గొన్నారు.


కారు ఢీకొని వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



తవిటిరాజు మృతదేహం



ఆస్పత్రి వద్ద మృతుని భార్యను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు



మృతిచెందిన తవిటిరాజు (ఫైల్)

సీతంపేట: రాంగ్‌రూట్‌లో వచ్చిన ఒక కారు వైఎస్సార్‌సీపీ నాయకుడు సవర తవిటిరాజు (48) ప్రాణాలు బలిగొంది. సీతంపేట మండలంలోని చీడి మానుగూడకు చెందిన హడ్డుబంగి ఎంపీటీసీ ఎస్.సరోజిని భర్త తవిటిరాజు తన ద్విచక్రవాహనంపై సీతంపేట వస్తుండగా ఎదురుగా పాలకొండ నుంచి కొత్తూరు వైపు వెళ్తున్న కారు కంబగూడ గ్రామ మలుపువద్ద రాంగ్‌రూట్‌లో వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో తవిటిరాజు కాలువిరిగి, తలకు బలమైన గాయం తగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మృతుడికి భార్య సరోజిని, ఇద్దరు కుమార్తెలు సావిత్రి, తిరుమల, కుమారుడు సంతోష్ ఉన్నారు. సీతంపేటకు పనిమీద వెళ్లిన భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయాడన్న విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులంతా ఏరియా ఆస్పత్రికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. స్థానిక ఎస్సై వై.అమ్మన్నరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కన్నీటి పర్యంతమైన మాజీ ఎమ్మెల్యే కళావతి

ఎంపీటీసీ సరోజిని భర్త తవిటినాయుడు మరణవార్త విన్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హుటాహుటిన సీతంపేట ప్రాంతీయ ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని చూసి కంటతడి పెట్టారు. మంచికి మారుపేరు అయిన తవిటిరాజును మరువలేమన్నారు. రోదిస్తున్న ఎంపీటీసీ సరోజినిని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. తాను మీకుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎస్టీసెల్ నియోజకవర్గ కన్వీనర్ నిమ్మక కాంతారావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, సర్పంచ్‌లు బి.తిరుపతిరావు, ఎస్.సుశీల, ఎంపీటీసీలు ఎస్.చంద్రశేఖర్, ఎస్.మంగయ్య, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

లారీ కింద పడి వ్యక్తి దుర్మరణం



108లో తరలిస్తుండగా మృతిచెందిన సత్యనారాయణ

బొబ్బిలి: పట్టణ సమీపంలోని గ్రోత్ సెంటర్ వద్ద ప్రమాదవశాత్తు లారీకింద పడి బలిజిపేట మండలం అరసాడ గ్రామానికి చెందిన వంగపండు సత్యనారాయణ(35) గురువారం దుర్మరణం చెందాడు. జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ బుధవారం రాత్రి విధులు ముగించుకుని మోటార్ సైకిల్‌పై బొబ్బిలి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో వెనుక టైరుకింద పడగా కుడికాలి సగానికి తెగిపడింది. స్థానికులు 108 వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్సను అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు సత్యనారాయణ భార్య గతేడాదే అకాలమరణం చెందగా ప్రస్తుతం పదేళ్ల వయస్సున్న వారి పాప అనాథగా మిగిలింది.

వైద్యసౌకర్యం అందక మరణాలు

- ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

పార్వతీపురం టౌన్: పీటీడీ(ఆర్టీసీ) ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ ద్వారా వైద్యసౌకర్యాలు అందక ఏడాదికి 350 మంది చనిపోతున్నారని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నిర్మాణసభను స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల విలీనం అనంతరం ఉత్పన్నమవుతున్న ప్రధానమైన సమస్యలలో ప్రధానంగా గతంలో ఆర్టీసీ ఉద్యోగులు ఒక్కరూపాయి కూడా చెల్లించకుండానే మెరుగైన వైద్యం రిఫరల్ ఆస్పత్రుల ద్వారా అందించేవారన్నారు. అయితే ప్రస్తుతం ఈహెచ్‌ఎస్ ద్వారా సరైన వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ఆదుకునే విధంగా విలీనానికి ముందున్న పాత పద్ధతుల్లోనే రిఫరల్ ఆస్పత్రుల ద్వారా వైద్యసౌకర్యాలు అందించాలని, అలాగే మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. విలీనానికి ముందు పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు కల్పించి బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ప్రభుత్వ పరిధిలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులకు గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన 24 నెలలు 11వ పీఆర్‌సీ ఎరియర్స్, డీఏ బకాయిలు పెండింగ్ ఉన్న నాలుగు డీఏలు చెల్లించాలన్నారు. ప్రస్తుతం ప్రవేశ పెట్టబోతున్న విద్యుత్ బస్సులన్నీ ఆర్టీసీ ద్వారా నిర్వహించి ఆర్టీసీ సిబ్బందితో ఆబస్సులు నడపాలని, ప్రస్తుతం ఉన్న 10 వేల పోస్టుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి సిబ్బంది రిక్రూట్‌మెంట్ చేయాలని కోరారు. మహిళలకు ఆగస్టు నుంచి ఫ్రీ బస్ స్కీమ్ పెట్టక ముందే 3000 కొత్తబస్సులు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, జిల్లా అధ్యక్షుడు మరిపి శ్రీనివాసరావు అధ్యక్షతన, జిల్లాకార్యదర్శి పైల సుందరరావు విజయనగరం జోన్ జోనల్ కార్యదర్శి బాసూరి కష్ణమూర్తి, విజయనగరం జిల్లా ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి గొల్లపల్లి రవికాంత్‌తో తాటు జిల్లాలో ఉన్న పాలకొండ సాలూరు, పార్వతీపురం డిపోల అధ్యక్ష, కార్యదర్శులు అధిక సంఖ్యలో ఉద్యోగులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశానికి ముందు డిపో నుంచి ఎన్జీఓ హోమ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఆటోలో 46కిలోల గంజాయి పట్టివేత



గంజాయి తరలిస్తున్న నిందితులతో ఎస్పీ వకుల్ జిందల్,డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు

- ఏడుగురు నిందితుల అరెస్ట్
- ఒడిశా నుంచి ఢిల్లీకి తరలింపు

విజయనగరం క్రైమ్: విజయనగరంలో వన్‌టౌన్ పోలీసులు, క్రైమ్ పార్టీ నగరంలోని ట్యాంక్ బండ్ వద్ద ఎల్‌ఐసీ బిల్డింగ్ దగ్గర 46 కేజీల గంజాయిని గురువారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్పీ వకుల్ జిందల్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం వన్ టౌన్ పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో ఆటోలో ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్ మీదుగా ఢిల్లీకి తరలించేదుకు తరలిస్తున్న 46కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. కాగా ఆటోలో పోలీసులు తనిఖీ చేయగా బ్యాగుల్లో 46 కేజీలు గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి దాన్ని తరలిస్తున్న ఏడుగురు నిందితులైన చందక శ్రీను (28) చొంపి దివాకర్ (22) చొంపి కళ్యాణ్, (24) తంగుళ కిరణ్ కుమార్ (21), చొంపి సన్యాసిరావు (20) పిల్లా శివ (24) పిల్లా కమాలాకర్ (22) అనే ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.అలాగే ఆటో తో పాటు 46కిలోల గంజాయి, ఒక పల్సర్ బైక్, 5 సెల్‌ఫోన్లు, రూ.8 వేలు సీజ్ చేశారు. పట్టుబడిన నిందితులను విచారణ చేయగా పెదబయలుకు చెందిన చందక శ్రీను గంజాయిని ఆటోలో విజయనగరం తీసుకువచ్చి ఇక్కడి నుంచి కాకినాడకు చెందిన మరో ఇద్దరి ద్వారా హైదరాబాద్ కు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని ఎస్పీ వకుల్ జిందల్ చెప్పారు. పరారైన ప్రధాన నిందితుడు అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలుకు చెందిన రాంబాబును అరెస్టు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, వన్ టౌన్ సీఐ ఆర్.వి.ఆర్.కె చౌదరి, ఎస్ఐలు బి.సురేంద్ర నాయుడు, డి.రామ్ గణేష్ ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.